AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
23-9-2025 (Tuesday) MAIN EDITION

## ఈడీ ముందుకు యువరాజ్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మాజీ క్రికెటర్ యువరాజ్‌సింగ్ మంగళవారం ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ 1xBet తో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఈడీ ఆయనకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో అధికారులు ఆయనను ప్రశ్నించారు. గేమింగ్ యాప్‌లతో జరిపిన లావాదేవీలపై ఆరా తీశారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులో ఇప్పటికే మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్పను ఈడీ విచారించింది.

## విండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు పంత్ దూరం..




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** ఆసియాకప్ 2025 తర్వాత టీమ్ ఇండియా స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ అక్టోబర్ 2న ప్రారంభం కానుండగా, భారత్ జట్టును బీసీసీఐ సెలెక్షన్ కమిటీ బుధవారం ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఈ సిరీస్‌కు కీలక ఆటగాడు రిషబ్ పంత్ అందుబాటులో ఉండడని సమాచారం. ఈ వార్తతో అభిమానులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇంగ్లాండ్ పర్యటనలో నాలుగో టెస్టు సందర్భంగా పంత్ కాలికి గాయమవడంతో, అప్పటి నుంచి అతను విశ్రాంతిలోనే ఉన్నాడు

## క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అధ్యక్షుడిగా గంగూలీ



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మరోసారి క్రికెట్ పరిపాలనలోకి అడుగుపెట్టాడు. ఆరేళ్ల విరామం తర్వాత క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అధ్యక్షుడిగా గంగూలీ తిరిగి ఎన్నికయ్యాడు. సోమవారం జరిగిన క్యాబ్ 94వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆగిపోయిన మెట్రో రైలు



అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. ఉదయం మెట్రో రైలు సాంకేతిక కారణాలతో ఆగిపోయింది. భరత్‌నగర్ స్టేషన్‌లో 8 నిమిషాలకి పైగా ట్రైన్ ఆగిపోవ డంతో ప్రయాణికులు కంగారుపడ్డారు. అనంతరం సాంకేతిక నిపుణులు సమస్యను పరిష్కరించారు.

## ఒక్కరోజే వేలాది కార్ల విక్రయాలు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలతో పాటు దసరా నవరాత్రుల సందర్భంగా కార్ల విక్రయాలు జోరందుకున్నాయి. సోమవారం నుంచే జీఎస్టీ సంస్కరణలు అమలులోకి రావడం, నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో తొలిరోజే వాహనాల విక్రయాలు అదరగొట్టాయి. సోమవారం దేశవ్యాప్తంగా 30 వేల కార్లు అమ్ముడుపోయాయి.





## సోలార్ పవర్ సెక్టార్ నుంచి మరో ఐపీవో

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** దేశీయ స్టాక్ మార్కెట్‌లో మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. సోలార్‌వరల్డ్ ఎనర్జీ సబ్‌స్క్రిప్షన్ మంగళవారం ప్రారంభమైంది. గురువారం వరకు కొనసాగనుంది. ఈ కంపెనీ మార్కెట్ నుంచి రూ.490 కోట్లను సేకరించడం కోసం ఐపీవోకు వస్తోంది. ఇందులో రూ. 440 కోట్లు ఫ్రెష్ ఇష్యూ కాగా.. మిగిలినది ఆఫర్ ఫర్ సేల్. సోలార్‌వరల్డ్ ఎనర్జీ ఐపీవో ప్రైస్‌బాండ్‌ను ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 333 నుంచి రూ. 351 గా నిర్ణయించింది. ఒక లాట్‌లో 42 షేర్లున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు గరిష్ట ప్రైస్‌బాండ్ వద్ద రూ. 14,742 తో బిడ్ వేయాల్సి ఉంటుంది.ఈ నెల 30న కంపెనీ షేర్లు లిస్టవుతాయి.



## అమెరికా కంపెనీల సీఈవోలుగా భారతీయులు

**అక్షరటుడే, అంతర్జాతీయం :** హెచ్ 1బీ వీసాలపై ట్రంప్ నిర్ణయం వేళ అమెరికాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. యూఎస్ అధ్యక్షుడు హెచ్ 1బీ వీసాల దరఖాస్తు ఫీజును భారీగా పెంచిన విషయం తెలిసిందే. తాజాగా రెండు అమెరికా కంపెనీలు భారతీయులను సీఈవోలుగా నియమించుకున్నాయి. ఓ వైపు ట్రంప్ భారత వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుండగా.. కంపెనీలు తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా కంపెనీ టీ మొబైల్ తమ సీఈవోగా శ్రీని గోపాలన్‌ను నియమించింది. చికాగోకు చెందిన మల్సోన్ కూర్స్ సంస్థ రాహుల్ గోయల్‌ను సీఈవోగా నియమించింది.



## హైదరాబాద్‌కు భారీ వర్షసూచన

**అక్షరటుడే, హైదరాబాద్ :** నగరంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం కురిసిన వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోసారి భారీ వాన పడుతుందని చెప్పడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ఆల్మట్టి ఎత్తు పెంపు కాంగ్రెస్ పార్టీలో కొత్త చిచ్చు రేపింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల మధ్య వివాదం రాజేసింది. బాగల్‌కోట్ జిల్లాలోని కృష్ణా నదిపై ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచాలని కర్ణాటక మంత్రివర్గం ఇటీవల తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. దీనితో కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటక మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉంది.**

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# తెలంగాణ Vs కర్ణాటక

■ రెండు రాష్ట్రాల మధ్య ఆల్మట్టి చిచ్చు ■ ఎత్తు పెంచాలని సిద్దరామయ్య సర్కారు నిర్ణయం ■ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రేవంత్ ప్రభుత్వం


కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచాలని సెప్టెంబర్ 17న నిర్ణయించింది. ఈ ఎత్తు పెరుగుదల 2013 కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్II (KWDTII) అవార్డుకు అనుగుణంగా ఉందని, సముద్రంలో కలిసే వృథా జలాలను సద్వినియోగం చేసుకుంటామని పేర్కొంది. ఎగువ కృష్ణ ప్రాజెక్ట్ (UKP3) మూడవ దశ కోసం సేకరించే భూములకు ఎకరానికి రూ. 40 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఆనకట్ట ఎత్తు పెంచడం ద్వారా అదనంగా 100 టీఎంసీ నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని యోచిస్తోంది. ఇందుకోసం 1.33 లక్షల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇందులో 75,563 ఎకరాలు పూర్తిగా నీట మునుగుతుంది.

ఆల్మట్టి ఎత్తు పెంపునకు సంబంధించి కర్ణాటక సర్కారు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతోంది. మంగళవారం జరిగిన కర్ణాటక మంత్రివర్గ సమావేశంలోనూ ఆల్మట్టి ఎత్తుపై నిర్ణయం తీసుకున్నారు. ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచడానికి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా అడ్డంకులను తొలగించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భూసేకరణ ప్రక్రియ కోసం 1.30 లక్షల ఎకరాలను సేకరించడానికి రూ. 70 వేల కోట్లు కేటాయించినట్లు తెలిసింది.

### వ్యతిరేకిస్తున్న రేవంత్ సర్కారు..

ఆల్మట్టి ఎత్తు పెంచాలన్న కర్ణాటక నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు న్యాయ పోరాటం చేస్తామని తెలిపింది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న జల వివాదాలను పరిష్కరించుకోకుండా ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తు పెంపు ప్రయత్నాలు మంచిది కాదని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. దీర్ఘకాల అంతర్‌రాష్ట్ర జల వివాదానికి కేంద్రంగా ఉన్న ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచాలనే కర్ణాటక ప్రతిపాదనకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం తరఫున ఢిల్లీలో బలంగా వాదనలు వినిపిస్తామని చెప్పారు. కర్ణాటక సర్కారు తీరు నదీతీర హక్కులను ఉల్లంఘించడంతో పాటు 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. "ఆల్మట్టి ఆనకట్ట సమస్య ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. ఆనకట్ట ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా వాదనలు సమర్పించడానికి మేము ఢిల్లీకి వెళ్తున్నాం. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాను పొందేందుకు ఏ రాష్ట్రంతోనైనా పోరాడుతాం. నదీ జలాల కేటాయింపులో తెలంగాణకు ఇప్పటికే అన్యాయం జరిగింది. దీన్ని ఏమాత్రం ఉపేక్షించబోమం" అని స్పష్టం చేశారు. నీటి సమస్యలపై తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సహా అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు.

## నిరుద్యోగుల తరఫున పోరాటం: బీజేపీ



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మాట ఇచ్చి తప్పిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు వారి తరఫున తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉద్యోగార్థులతో రాంచందర్‌రావు మాటామంతీ నిర్వహించారు. అలాగే, సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులతో సమావేశమై మాట్లాడారు. గ్రూప్-1 వివాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది, ఇప్పటికీ ఒక్క ఉద్యోగమైనా భర్తీ చేసిందా? అని రాంచందర్‌రావు ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసిందని ఆయన పేర్కొన్నారు.

## తల్లి కాబోతున్న కత్రినాకైఫ్




**అక్షరటుడే, ముంబై:** బాలీవుడ్ జంట విక్కీ కౌషాల్, కత్రినా కైఫ్ తమ అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పారు. తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కత్రినా మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. తాను తల్లి కాబోతున్నానని ప్రకటిస్తూ బేబీ బంప్‌తో ఉన్న ఫొటోను షేర్ చేసింది.

## స్టాలిన్ సర్కారుకు సుప్రీం తలంటు..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మంగళవారం చీవాట్లు పెట్టింది. జనం సొమ్ముతో విగ్రహాలు ఏర్పాటు చేయడం, స్మారక చిహ్నాలు నెలకొల్పడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరునెల్వేలి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాజకీయ ప్రముఖులకు అంకితం చేసిన స్మారక చిహ్నాల కోసం ప్రభుత్వ స్థలాలు, పన్ను చెల్లింపుదారుల డబ్బును ఉపయోగించడంపై కొంతకాలంగా చర్చ జరుగుతున్న తరుణంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. ‘‘మీ నాయకులను కీర్తించడానికి ప్రజల సొమ్మును వినియోగించడాన్ని అనుమతించబోమం. దీనికి అనుమతి లేదు. మీ మాజీ నాయకులను కీర్తించడానికి మీరు ప్రజా ధనాన్ని ఎందుకు ఉపయోగిస్తున్నారు?" అని జస్టిస్ విక్రమ్ నాథ్, ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని సూచించింది.

## దసరా సెలవుల్లో సినిమాల సందడి




**అక్షరటుడే, సినిమా డెస్క్:** దసరా సెలవుల్లో పలు భారీ సినిమాలు సందడి చేయనున్నాయి. సెలవుల్లో మూడు చిత్రాలు రిలీజ్ కానున్నాయి. ఇందులో పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఓజీ చిత్రం భారీ లెవల్‌లో సెప్టెంబర్ 25న విడుదల కానుంది. అదే సమయంలో బాలీవుడ్ ప్రేక్షకుల కోసం ఆస్కార్ నామినేటెడ్ మూవీ ‘హౌమ్ బౌండ్’ కూడా హిందీలో సెప్టెంబర్ 25న థియేటర్లలోకి రాబోతోంది. ఇక ఈ సినిమాల తర్వాత మళ్లీ అందరి దృష్టి అక్టోబర్ 2న విడుదల కానున్న కాంతార చాప్టర్-1 చిత్రంపై ఉంది. రీసెంట్‌గా మూవీ ట్రైలర్ విడుదల కాగా, ఇది చిత్రంపై భారీ అంచనాలు పెంచింది. అలాగే పలు చిత్రాలు ఓటీటీలోనూ రిలీజ్ కానున్నాయి. మొత్తంగా చూస్తే మూవీ లవర్స్ ఈ దసరా సెలవుల్లో పండుగ చేసుకోనున్నారు.

## అర్జున్ రెడ్డి బ్యూటీకి బర్త్‌డే విషెస్..



టాలీవుడ్‌లో ఒక్క హిట్ వస్తే చాలు వారి దశ తిరుగుతుంది అని అంటారు. కొందరు హీరోయిన్స్ మాత్రం వచ్చిన ఆ ఒక్క ఛాన్స్‌ను బాగా వాడుకుని స్టార్‌డమ్ అందుకుంటే, మరికొందరు తొలి విజయం తర్వాత జాడ లేకుండా పోతుంటారు. అలాంటి పరిస్థితే ప్రస్తుతం 'అర్జున్ రెడ్డి' ఫేమ్ షాలిని పాండే ఎదుర్కొంటోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో విడుదలైన అర్జున్ రెడ్డి (2017) సినిమాతో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన షాలినికి, ఆ సినిమా బ్లాక్ బస్టర్ విజయంతో ఓవర్‌నైట్‌గా స్టార్ ఇమేజ్ వచ్చింది. విజయం తర్వాత వరుసగా ఆఫర్స్ వచ్చినా, అవి అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. ఇప్పటివరకు ఆమె తెలుగు, తమిళం, హిందీ భాషల్లో కలిపి సుమారు 12 సినిమాల్లో నటించింది. అభినయం, అందం రెండూ ఉన్నప్పటికీ కెరీర్‌లో మాత్రం నిలదొక్కుకోలేకపోవడం ఆమె అభిమానులను ఎంతో బాధిస్తుంది. అయితే నేడు ఈ అమ్మడి బర్త్ డే కావడంతో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

–అక్షరటుడే, సినిమా డెస్క్